సాక్షి
హైదరాబాద్
ఆదివారం । 26 । నవంబర్ । 2023





మోదీ 'విజయ సంకల్పం'

మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం బీజేపీ అభ్యర్థులు అందెల శ్రీరాములు యాదవ్, తోకల శ్రీనివాస్ రెడ్డి, రవికుమార్ యాదవ్, నోముల దయానంద్ గౌడ్‌లకు మద్దతుగా శనివారం తుక్కుగూడ వేదికగా నిర్వహించిన విజయ సంకల్ప సభలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొని ప్రసంగించారు. మోదీ రాకతో కమలనాథుల్లో కదనోత్సాహం ద్విగుణీకృతమైంది.





అమితోత్సాహం

ఖైరతాబాద్ బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డిని గెలిపించాలంటూ శనివారం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 లోని ఎన్బీటీ నగర్‌లో నిర్వహించిన రోడ్ షోలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చాక 2.5 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.



యోగి రాజా.. కాషాయమయం

గోషామహల్ బీజేపీ అభ్యర్థి రాజాసింగ్‌కు మద్దతుగా పురానాపూల్ చౌరస్తా నుంచి బేగంబజార్ ఛత్రి వరకు నిర్వహించిన రోడ్ షోలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాల్గొని ప్రసంగించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజలకు అన్నివిధాలా రక్షణ కల్పించి అభివృద్ధి చేస్తామన్నారు.



పబ్లిసిటీ హీట్

నగరంలో బీజేపీ, కాంగ్రెస్ జాతీయ నేతలు ❖ పబ్లిక్ మీటింగులు,రోడ్ షోలతో బీఆర్ఎస్ హోరాహోరీ





ముషీరాబాద్‌లో డీకే, సనత్‌నగర్‌లో మల్లికార్జున ఖర్గే



రోడ్ షోలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో గోషామహల్ బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న కొద్దీ అన్ని పార్టీలూ ప్రచార వేగం పెంచాయి. ప్రచారం ముగిసేందుకు మూడు రోజుల గడువు మాత్రమే ఉండటంతో ప్రజలను కలిసేందుకు, తమ పార్టీ చేసే మేలు చెప్పేందుకు, తమకే ఓటేయమని కోరేందుకు ఉరుకులు, పరుగులు పెడుతున్నాయి. సమయం సమీపిస్తుండటంతో ప్రజలు ఏ క్షణాన ఎటువైపు మొగ్గు చూపుతారోనని ఆందోళన చెందుతున్నాయి. వారిని తమవైపు ఆకట్టుకునేందుకు టెన్షన్ పడుతున్నాయి. మరోవైపు ఆయా పార్టీల రాష్ట్ర, జాతీయ నేతలు సుడిగాలి పర్యటనలతో ముమ్మర ప్రచారాలు నిర్వహిస్తున్నారు. మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ వివిధ పద్ధతుల్లో ప్రచారం చేస్తున్నారు. హోటళ్లలో ముచ్చట్లతో పాటు మెట్రో ప్రయాణంతోనూ ప్రజలను పలకరించారు. బీఆర్ఎస్‌ను దీటుగా ఎదుర్కొనేందుకు బీజేపీ, కాంగ్రెస్ జాతీయ నేతలు నగరంలో దిగారు. శనివారం ఒక్కరోజే ప్రధాని సహా బీజేపీ అగ్రనేతలంతా గ్రేటర్‌లో ప్రచారంలో పాల్గొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మహేశ్వరం నియోజకవర్గంలో జరిగిన బహిరంగసభలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని మరోసారి తూర్పారబట్టారు. కాంగ్రెస్ బీఆర్ఎస్‌కు కార్బన్ పేపరేనని వ్యాఖ్యానించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఖైరతాబాద్ నియోజకవర్గంలో, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గోషామహల్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా సికింద్రాబాద్, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో నిర్వహించిన రోడ్ షోల్లో పాల్గొన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గం బన్సీలాల్‌పేటలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రోడ్‌షో నిర్వహించారు. మోదీ, కేసీఆర్‌లపై ఖర్గే విమర్శనాస్త్రాలను సంధించగా.. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం మూడూ ఒకటేనని యోగి ధ్వజమెత్తారు. బేగంబజార్, మూసారంబాగ్‌లలో కేటీఆర్, ముషీరాబాద్, సనత్‌నగర్ రోడ్ షోల్లో డీకే శివకుమార్ పాల్గొన్నారు.



ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని బావర్చీ హోటల్‌లో ముచ్చటిస్తున్న రాహుల్

గ్రేటర్‌లో స్థిరపడిన ఇతర రాష్ట్రాల ఓటర్లే ప్రధానం

- వేర్వేరు ప్రాంతాల్లో లక్షల సంఖ్యలో నివాసం
- శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్‌లో ఏపీవాసులు
- వీరి ఓట్లపై బీఆర్ఎస్, కాంగ్రెస్ ఆశలు
- ఉత్తరాది ఓటర్లపై బీజేపీ కన్ను

సాక్షి, సిటీబ్యూరో: ఉద్యోగం, ఉపాధి, విద్య కారణాలేమైనా దేశంలోని వివిధ రాష్ట్రాలు, తెలంగాణలోని ఇతర జిల్లాల నుంచి భాగ్యనగరికి వచ్చి స్థిరపడుతుంటారు. దీంతో వివిధ మతాలు, సంస్కృతీ సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లతో హైదరాబాద్ కాస్మోపాలిటన్ సిటీగా పేరుగాంచింది. ఈ నెల 30న జరగనున్న శాసనసభ ఎన్నికలలో మినీ భారత్‌గా పిలిచే గ్రేటర్‌లో వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చి స్థిరపడిన ఓటర్లు కీలకంగా మారనున్నారు. రాజధాని పరిధిలోని 29 నియోజకవర్గాల్లో మెజార్టీ స్థానాలలో అభ్యర్థుల భవితను వీరు నిర్ణయించనున్నారు.

వారి మద్దతు కోసం..

గ్రేటర్‌లో స్థిర నివాసం ఏర్పర్చుకున్నవారి మద్దతు కూడగట్టేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. వీరిని ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు ఆయా ప్రాంతాల నుంచి నేతలను రప్పించి ఆ ఓటర్లతో మాట్లాడిస్తున్నారు. నాలుగైదు రోజుల్లో వివిధ రాష్ట్రాల నుంచి పలు పార్టీల నేతలు ప్రత్యేకంగా హైదరాబాద్‌కు వస్తుండటం విశేషం. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లిలో ఏపీ నుంచి వచ్చిన వారే అధికంగా ఉన్నారు. 2014 ఎన్నికల్లో ఈ సెగ్మెంట్లలో టీడీపీ అభ్యర్థులే గెలుపొందారు. ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రస్తుతం ఈ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు ఓ వర్గం ఓటర్లను ఆకర్షించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో గచ్చిబౌలిలో జరిగిన నిరసన కార్యక్రమంలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సంఘీభావం తెలపడం ఇందులో భాగమే.

ఉత్తరాది ఓటర్లపై ఆశలు..

ఎల్బీనగర్ పరిధిలో తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల వారు వేల సంఖ్యలో ఉన్నారు. ఇక్కడి బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు సుధీర్ రెడ్డి, మధుయాష్కీ, ఆయా ఓటర్ల మీదే దృష్టి పెట్టారు. మహేశ్వరంలో దాదాపు 70 వేల నుంచి లక్ష మంది వరకు బిహార్, రాజస్థాన్, యూపీ ఇతర ప్రాంతాల ఓటర్లు ఉన్నారు. వీరిని తమ వైపు తిప్పుకునేందుకు బీజేపీ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. సాధారణంగానే ఉత్తరాది రాష్ట్రాలవారు బీజేపీకి మద్దతుగానే ఉంటారు. వీరు ఎటువైపు మొగ్గు చూపితే వారికే విజయం లభించే అవకాశం ఉంది. గ్రేటర్‌లో బీజేపీ ప్రధానంగా కొన్ని వర్గాల ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు జనసేన పార్టీతో పొత్తు పెట్టుకుంది. ఓ వర్గం ఓట్లే లక్ష్యంగా అదే సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థి ప్రేమ్ కుమార్‌ను కూకట్‌పల్లి నుంచి జనసేనకు టికెట్ కేటాయించడం ఇందులో భాగమే.



ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, బిహార్, ఉత్తర ప్రదేశ్, ఝార్ఖండ్, పంజాబ్, తమిళనాడు, కేరళ, ఒడిషా తదితర రాష్ట్రాలతో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాలకు సంబంధించి గ్రేటర్‌లో స్థిరపడినవారు సుమారు 42 లక్షల మంది ఉంటారని అంచనా. ఏపీ నుంచి వచ్చిన వారిలో అత్యధికంగా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, ఎల్బీనగర్, సనత్‌నగర్ వంటి నియోజకవర్గాలలో, మహేశ్వరం, గోషామహల్, జూబ్లీహిల్స్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ వంటి సెగ్మెంట్లలో ఇతర రాష్ట్రాల వారు స్థిరపడ్డారు. ఆయా నియోజకవర్గాల్లోని అభ్యర్థుల గెలుపోటములు నిర్ణయించేది వీరే అనడంలో సందేహం లేదు.



1,98,199 ఉల్లంఘనలు

గోడలపై రాశారు.. పోస్టర్లు వేశారు

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల ప్రవర్తనావళి నిబంధనల్ని ఎన్నికల షెడ్యూలు వెలువడినప్పటి నుంచే పాటించాలి. అందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు భవనాలపై, గోడలకు ఎలాంటి రాజకీయ రాతలు రాయకూడదు. బహిరంగ ఖాళీ ప్రదేశాల్లోనూ దీన్ని అమలు చేయాలి. డిఫేస్‌మెంట్ నిరోధక చట్టం అమలు చర్యల్లో భాగంగా ఆయా ప్రాంతాల్ని అందవికారంగా మార్చే ఇలాంటివి నిషిద్ధం. వీటితోపాటు పోస్టర్లు వేయడం, బ్యానర్లపై రాయడం కూడా నిషేధం. వీటితో పాటు ఇతరత్రా పద్ధతుల్లోనూ రాజకీయ నేతలు, వారి ఫొటోలు, స్లోగన్లతో ఉండేవేవీ ప్రదర్శించరాదు. ఎలాంటి రాజకీయ ప్రచారాలు నిర్వహించరాదు. ప్రైవేటు భవనాలకు సంబంధించి మాత్రం మినహాయింపు ఉంది. భవన యజమానుల అనుమతి తీసుకొని మాత్రం వారి భవనాల గోడల్ని ప్రచారాలకు వినియోగించుకోవచ్చు. ఈ మేరకు నిబంధనలైతే ఉన్నప్పటికీ నగరంలో ఇవి అమలవుతున్న దాఖలాల్లేవు. గ్రేటర్ నగరంలోని హైదరాబాద్ జిల్లా పరిధిలోనే ఇప్పటి వరకు ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు, ఖాళీ ప్రదేశాల్లో 1,98,199 ఉల్లంఘనల్ని సంబంధిత అధికార యంత్రాంగం గుర్తించింది. వాటిని తొలగించే చర్యలు సైతం చేపట్టింది. అలా ఉల్లంఘనలకు విరుద్ధంగా వెలసిన బ్యానర్లు, పోస్టర్ల తొలగింపుతో పాటు గోడలపై రాతల్ని చెరిపివేస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు 1,66,623 ఉల్లంఘనల్ని తొలగించినట్లు అధికారులు పేర్కొన్నారు.

కనిపించని చర్యలు

అయినప్పటికీ ఇప్పటి వరకు ఎవరిపైనా, ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నిబంధనలకు విరుద్ధంగా ఈ ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉండగా, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిసింది. ఇతరత్రా నిబంధనల ఉల్లంఘనలపై కేసులు నమోదు చేస్తున్నప్పటికీ, ఈ ఉల్లంఘనలపై మాత్రం ఎలాంటి కేసులు నమోదు కాలేదు.

అతిక్రమించారు ఇలా

ప్రభుత్వ భవనాలకు సంబంధించి 6,663 గోడలపై రాతలు, 86,953 పోస్టర్లు, 30,125 బ్యానర్లతో పాటు ఇతరత్రా వెరసి మొత్తం 1,66,623 ఉల్లంఘనల్ని గుర్తించారు. అలాగే ప్రైవేట్‌భవనాలకు సంబంధించి 1,247 గోడలపై రాతలు, 21,727 పోస్టర్లు, 5,311 బ్యానర్లతో పాటు ఇతరత్రా మొత్తం 31,576 ఉల్లంఘనల్ని గుర్తించారు. ఇలా ప్రభుత్వ, ప్రైవేటు భవనాలపై మొత్తం 1,98,199 ఉల్లంఘనల్ని గుర్తించారు.

నగరంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం పతాకస్థాయికి చేరుకుంది. ఇంచుమించు నెలన్నరకు పైగా హోరాహోరీగా ఎన్నికల పోరు సాగిస్తున్న పార్టీలు తాజాగా పోల్ మేనేజ్‌మెంట్‌పై సీరియస్‌గా దృష్టి సారించాయి. ప్రచారానికి మరో మూడు రోజులే గడువు ఉండడంతో రాజకీయ నాయకులు ఇంటింటికీ తమ 'అభ్యర్థన'ను చేరవేస్తున్నారు. మరోవైపు అపార్ట్‌మెంట్‌లు, కాలనీల వారీగా ఓటర్లను వివిధ కేటగిరీల్లో వర్గీకరించి పోల్ 'మేనేజ్‌మెంట్' కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా 'నైట్ పార్టీలు' జోరుగా సాగుతున్నాయి. అపార్ట్‌మెంట్‌లలోనే ఓటర్లను సమావేశపరిచి 'సీసాల' కొద్దీ ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 'ప్రతి పార్టీకి అన్ని చోట్ల శాశ్వత ఓటుబ్యాంకులు ఉంటాయి. వాళ్లు కచ్చితంగా ఆ పార్టీకే ఓట్లు వేస్తారు. కానీ ఇప్పుడు తటస్థ ఓటర్లను మావైపు తిప్పుకోవడమే కీలకం. ఈ ఓటర్ల కోసమే పోల్ మేనేజ్‌మెంట్' అని ఒక పార్టీ నాయకుడు అభిప్రాయపడ్డారు. ఈ కేటగిరీకి చెందిన ఓటర్లను కనీసం 10 శాతం అనుకూలంగా మార్చుకోగలిగినా కచ్చితంగా గెలిచి తీరుతాం' అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నెల రోజులుగా ప్రజల్లో తిరుగుతున్నప్పటికీ కొన్ని వర్గాలకు చెందిన ఓటర్ల వైఖరి ఇంకా అంతుచిక్కడంలేదని మరో పార్టీ నేత విస్మయం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే అన్ని చోట్ల అర్ధరాత్రి వరకు మద్యంతో పార్టీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమయంలోనే డబ్బుల పంపిణీ కూడా యథావిధిగా జరిగిపోతోంది.

– సాక్షి, సిటీబ్యూరో



పోల్.. గోల్

అపార్ట్‌మెంట్‌లు, కాలనీల్లో 'పార్టీ'లు

- తటస్థ ఓటర్లు, యూత్‌పైనే ప్రధాన దృష్టి
- వీరికి నిరంతరం 'టచ్'లో ద్వితీయశ్రేణి
- ప్రచారానికి మిగిలిందిక మూడ్రోజులే

మాటివ్వండి మహాశయా..

అన్ని రాజకీయ పార్టీలకు యూత్ ఓట్లు సవాల్‌గా మారాయి. ఎన్నికల ప్రచారంలో యువత పెద్దసంఖ్యలోనే కనిపిస్తున్నా.. క్షేత్రస్థాయిలో యువత మైండ్‌సెట్ ఎలా ఉంటుందనేది రాజకీయ నాయకులను ఆందోళనకు గురి చేస్తోంది. యువత ఆలోచనా సరళి తెలుసుకోవడం కష్టంగా ఉందని చెబుతున్నారు. కొత్తగా ఓటుహక్కు పొందిన వాళ్లు ఎటువైపు మొగ్గుతారనేది మరో కీలకమైన అంశం. యువతీ యువకుల్లో చాలామంది పోలింగ్‌బూత్ వరకు వెళ్లి ఓటు వేసేందుకు నిరాకరిస్తున్నారు. సామాజిక అవగాహన కొరవడడం వల్ల, ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం పట్ల బాధ్యతాయుతమైన దృక్పథం లేకపోవడం వల్ల ప్రతి ఎన్నికల్లోనూ యువత దూరంగానే ఉంటున్నారు. దీంతో గ్రేటర్‌లో 42 శాతం నుంచి 49 శాతం మధ్యలో ఓట్లు నమోదవుతున్నాయి.

నగదు.. నజరానాలు..


ఈ క్రమంలో యువత ఓటర్లను తమ ఖాతాలో వేసుకొనేందుకు అన్ని పార్టీలు శక్తివంచన లేకుండా కష్టపడుతున్నాయి. కొత్తగా ఓటు హక్కు పొందిన వారి నుంచి 30 ఏళ్ల వయసు వరకు ఉన్న యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు వేసేవిధంగా వారి కుటుంబ సభ్యులపై ఒత్తిడి తెస్తున్నారు. తల్లిదండ్రులతో పాటు పిల్లలు కూడా కలిసి వచ్చి ఓటింగ్‌లో పాల్గొనేవిధంగా ప్రతి ఇంటికీ వెళ్లి అభ్యర్థిస్తున్నారు. తమ పిల్లలతో తప్పనిసరిగా ఓటు వేయించే బాధ్యత తల్లిదండ్రులే తీసుకోవాలని కోరుతున్నారు. ఇందుకోసం ఓటర్ల నుంచి గట్టి హామీ తీసుకుంటున్నారు. 'ఇంటిల్లిపాదీ తమ పార్టీకే ఓటు వేస్తారని నమ్మకం కలిగిన తర్వాత మాత్రమే నగదు, నజరానాలు అందజేస్తున్నారు' అని దమ్మాయిగూడకు చెందిన ఓ టీచర్ తెలిపారు.

బూత్‌ల వరకు తరలించాల్సిందే..

ప్రతి ఓటరు మనవాడే అనే అపోహ లేకుండా పోలింగ్ బూత్‌ల వరకు ఓటర్లను తరలించేందుకు పార్టీలు కృషి చేస్తున్నాయి. ప్రతి ఓటరు ఓటు వేసే విధంగా ప్రోత్సహించేందుకు, ఒత్తిడి తెచ్చేందుకు, పైగా ఆ ఓటు తమ పార్టీకే వేసేవిధంగా అభ్యర్థించేందుకు పోలింగ్‌బూత్ స్థాయి నుంచే కార్యకర్తలను సన్నద్ధం చేస్తున్నారు. నవంబర్ 30వ తేదీన ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎక్కడా ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా విజయావకాశాలను పెంచుకొనేందుకు అన్ని పార్టీలు ప్రస్తుతం 'పోల్ మేనేజ్‌మెంట్'లో తలమునకలై ఉన్నాయి.

పక్కాగా లెక్కలు..

పోల్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బూత్‌ల వారీగా ఓటర్లపై కచ్చితమైన అంచనాలను సిద్ధం చేస్తున్నారు. వివిధ బూత్‌ల పరిధిలో గత ఎన్నికల్లో ఎన్ని ఓట్లు వచ్చాయి. ఈసారి అంతకంటే ఎక్కువ ఓట్లు రావాలంటే ఏం చేయాలి, ఏయే వర్గాలను కలవాలి, ఇంకా తాము కలవకుండా మిగిలిన ఓటర్లు ఎక్కడెక్కడ ఉన్నారనే విశ్లేషణతో కచ్చితమైన లెక్కలు వేస్తున్నారు. గత ఎన్నికల్లో గెలిచిన స్థానాల్లో మరోసారి విజయం సాధించేందుకు ప్రస్తుత అభ్యర్థులు వ్యూహాత్మకంగా ప్రచారం కొనసాగిస్తుండగా, కొత్తగా బరిలోకి దిగిన వారు క్షేత్రస్థాయి నుంచి ఓటర్లను అన్ని విధాలుగా ఆకట్టుకొనేందుకు ప్రతివ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు.



● ఓటేద్దామని మాటిద్దాం



ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. శనివారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో లెట్స్ ఓట్, ఎన్నికల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. డీజీపీ అంజనీకుమార్, మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి, లెట్స్ ఓట్ సంస్థ ప్రతినిధులు, ఎన్నికల సంఘం, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

– గచ్చిబౌలి

ఫ్యాషన్ స్టోర్‌లో నమ్రత శిరోద్కర్ సందడి..



ప్రతి మహిళ సౌందర్యవంతంగా ఉండటం వారికి ముఖ్యమైన విషయమని, ఫ్యాషన్ అందానికే కాకుండా ఆత్మస్థైర్యాన్ని కూడా నింపుతుందని ప్రముఖ నటి నమ్రతా శిరోద్కర్ తెలిపారు. జూబ్లీహిల్స్ వేదికగా నూతనంగా ఏర్పాటు చేసిన ఓ మల్టీ–డిజైనర్ స్టోర్‌ను నమ్రతా శిరోద్కర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్యాషన్‌కు ప్రాధాన్యతనిస్తానని, సందర్భాన్ని బట్టి అనువైన దుస్తులు ధరించడం చాలా ఇష్టమని ఆమె పేర్కొన్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

కౌంటింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్, డిప్యూటీ ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టి

బంజారాహిల్స్: డిసెంబర్ 3వ తేదీన నిర్వహించనున్న కౌంటింగ్ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, డిప్యూటీ ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శనివారం బంజారాహిల్స్‌లోని ఆదివాసీ భవన్‌లో కౌంటింగ్ సూపర్ వైజర్స్, కౌంటింగ్ అసిస్టెంట్‌లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..రిటర్నింగ్ అధికారుల సమక్షంలో కౌంటింగ్ సూపర్‌వైజర్స్, కౌంటింగ్ అసిస్టెంట్‌లు, మైక్రో అబ్జర్వర్‌లు కౌంటింగ్ నిర్వహించాలని తెలిపారు.

ర్యాండమైజేషన్ పూర్తైన తర్వాత కౌంటింగ్ సూపర్ వైజర్లు, అసిస్టెంట్‌లు తమకు కేటాయించిన డీఆర్‌సీ, కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించాలని తెలిపారు. కౌంటింగ్ రోజున మొదటగా పోస్టల్ బ్యాలెట్‌లను లెక్కించాలని తెలిపారు. ఎన్నికల సంఘం సూచించిన మేరకు కౌంటింగ్ సూపర్‌వైజర్లు కేవలం కంట్రోల్ యూనిట్‌లను మాత్రమే లెక్కించాలని తెలిపారు. సూపర్‌వైజర్లు కౌంటింగ్ సందర్భంగా ఫారం–17సి పార్ట్–1, ఫారం–2, ఫారం–20లను నమోదు చేయాలని తెలిపారు. కౌంటింగ్ రోజు సిబ్బంది మొదటగా కంట్రోల్ యూనిట్‌ల సీలింగ్‌ను పరిశీలించాలని తెలిపారు. అనంతరం కంట్రోల్ యూనిట్ ఆన్ బటన్‌ను క్లిక్ చేసి రిజల్ట్ బటన్ ద్వారా ఓట్ల లెక్కింపు అభ్యర్థుల వారీగా ఫారం–17సి పార్ట్–2లో నమోదు చేయాలని తెలిపారు. ఓట్ల లెక్కింపులో భాగంగా ఏమైనా టెండర్ ఓట్లు నమోదైతే వాటిని ప్రత్యేకంగా పరిశీలించి మొత్తం ఓట్ల నుండి టెండర్ ఓట్లను తీసివేసి లెక్కించాలని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మైక్రో అబ్జర్వర్లు ర్యాండమ్‌గా ఐదు పోలింగ్ స్టేషన్ల కంట్రోల్ యూనిట్లను పరిశీలించి ట్యాలీ చేస్తారని తెలిపారు. కౌంటింగ్ సిబ్బంది ఫారం –17–ఎ లో నమోదైన ఓట్ల సంఖ్యను 17–సి ద్వారా ట్యాలీ చేసుకోవాలని తెలిపారు. ఓట్ల లెక్కింపు పూర్తైన అనంతరం సంబంధిత అధికారులు ఫారంలో సంతకాలు చేసి రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని తెలిపారు. అనంతరం కంట్రోల్ యూనిట్ స్విచ్ ఆఫ్ చేసి బాక్స్ లలో అమర్చాలని తెలిపారు. కౌంటింగ్ సెంటర్ వద్ద ఏజెంట్లు 16 మందికి మించకుండా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా కౌంటింగ్ సిబ్బందికి కంట్రోల్ యూనిట్ ద్వారా నేరుగా శిక్షణ అందించారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ మంగతాయారు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటుపై అవగాహనకు 'ఫెస్టివల్ ఆఫ్ డెమోక్రసీ'



సాక్షి, సిటీబ్యూరో: ఓటు–ఓటర్ల విలువ తెలియజేసేలా నగరంలోని యంగిస్తాన్ ఫౌండేషన్ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించింది. ఫిల్మ్‌నగర్‌లోని ది మూన్ షైన్ ప్రాజెక్ట్ వేదికగా 'ఫెస్టివల్ ఆఫ్ డెమోక్రసీ' పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగరంలోని యువత, విద్యార్థులు, సమాజసేవకులు పాల్గొని ప్రజాస్వామ్యానికి అనుకూలంగా ప్రతిజ్ఞ చేశారు. విభిన్న కళలతో ఫ్యాన్సీ అండ్ ట్రెండీ విధానంలో ఓటు పైన అవగాహన కల్పించిన ఈ కార్యక్రమం ప్రత్యేకంగా నిలిచింది. మొదటిసారి ఓటు హక్కు పొందిన యువకులకు ప్రజాస్వామ్యం విలువలను తెలియజేసేలా 'ఫెస్టివల్ ఆఫ్ డెమోక్రసీ' కార్యక్రమాన్ని నిర్వహించామని యంగిస్తాన్ ఫౌండర్ అరుణ్ డేనియల్ ఎల్లమటి తెలిపారు. ఇందులో భాగంగానే ఓటు నేపథ్యంలో జానీ సందేశ్ హాస్యం, నాగేందర్, జకీ, బీట్ బాక్సర్ శుభదీప్‌లు తెలిపిన స్టోరీ టెల్లింగ్, కమెడియన్ నసీర్ స్టాండ్–అప్ పొలిటికల్ కామెడీ విశేషంగా ఆకట్టుకుంది.

గవర్నర్ పదవికి వన్నె తెస్తా: ఇంద్రసేనారెడ్డి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

నాగోలు: నిరంతరం ప్రజలకు సేవ చేస్తూ...మీరందరూ గర్వపడేలా గవర్నర్ పదవికి మంచి పేరు తెస్తానని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి కొత్తపేటలో కీ రైట్ థింకర్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి ఆత్మీయ సమ్మేళనం డాక్టర్ రావినూతల శశిధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ, ఈ ప్రాంతం నుంచి విద్యార్థి నాయకుడిగా, ఎమ్మెల్యేగా, బీజేపీలో జాతీయ స్థాయి వరకు ఎదిగానని తెలిపారు. మలక్‌పేట, ఎల్‌బీనగర్ ప్రజలకు రుణ పడి ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి ఘన సత్కారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, తెలుగు రాష్ట్రాల ఇన్‌కం ట్యాక్స్ అధికారి శ్రీసాయిప్రసాద్, ఏబీవీపీ రాష్ట్ర నాయకురాలు ఝాన్సీ, ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రామకృష్ణ, శేఖర్, జి.బ్రహ్మచారి, శివ, నిఖిలేష్, సంతోష్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ రాలేదని ఉపాధ్యాయుల ఆందోళన



సరూర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

లింగోజీగూడ: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు పోస్టల్ బ్యాలెట్ ఇవ్వకపోవడంతో వారు శనివారం ఆందోళన చేపట్టారు. సరూర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు మూడో విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు వినియోగించుకోని ఉపాధ్యాయులు తమకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తే వినియోగించుకోవాలని వేచి చూశారు. అయితే, వారికి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వకపోవడంతో ఆందోళనకు దిగారు. ప్రభుత్వం కావాలనే తమకు పోస్టల్ బ్యాలెట్ ఇవ్వడం లేదని, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించకపోతే తాము ఎన్నికల విధులను బహిష్కరిస్తామని వారు హెచ్చరించారు.

డిసెంబర్ 7న రాష్ట్ర స్థాయి డాక్ అదాలత్

సాక్షి, సిటీబ్యూరో: తపాలా సేవలకు సంబంధించి సేవలు, ఫిర్యాదులపై డిసెంబర్ 7న ఉదయం 11 గంటలకు వర్చువల్ మోడ్ (ఆన్‌లైన్) ద్వారా రాష్ట్ర స్థాయి డాక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు తపాలా శాఖ తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ ఒకటిలోగా..ఎస్ రంగారావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్, చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయం, తెలంగాణ సర్కిల్, హైదరాబాద్–500001 పేరిట ఫిర్యాదులు పంపాలన్నారు. ఫిర్యాదుదారులు తమ ఫిర్యాదుతో పాటు కమ్యూనికేషన్ కోసం మొబైల్ నంబర్, ఈమెయిల్ ఐడీ, చిరునామా స్పష్టంగా తెల్పాలన్నారు. డాక్ అదాలత్ మీటింగ్‌లో చేరడానికి లింక్ మొబైల్ నంబర్, ఈమెయిల్ ఐడీకి తెలియజేయడం జరుగుతుందన్నారు.

నేడు కార్తీక వనభోజన మహోత్సవం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ రాయలసీమ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో మియాపూర్‌లోని నరేన్ గార్డెన్ వేదికగా ఆదివారం కార్తీక వనభోజన మహోత్సవం –2023ను నిర్వహిస్తున్నామని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జస్టిస్ సి.లక్ష్మణరెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగానే రాయలసీమ రత్నాలు అవార్డులు ప్రదానం చేయనున్నామని పేర్కొన్నారు.

దేశానికి ప్రమాదకరం బీజేపీ

- ఈ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించాలి
- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

ఇబ్రహీంపట్నం: మతోన్మాద బీజేపీ దేశానికి ప్రమాదకరమని, ఆపార్టీని ఈ ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. ఇబ్రహీంపట్నంలోని పాషనరహరి స్మారక కేంద్రంలో శనివారం మీడియాతో మాట్లాడారు. బీజేపీ పట్ల బీఆర్‌ఎస్ తన స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. దేశంలో బీజేపీని నిరోధించేందుకు ఇండియా కూటమిగా ఏర్పడితే అందులోని భాగస్వామ్య పార్టీలతో కాంగ్రెస్ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్ తోపాటు తెలంగాణలో ఇండియా కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు అంశంలోనూ ఇదే వైఖరి కనబర్చిందని మండిపడ్డారు. రాష్ట్రంలో వామపక్షాలతో చివరి వరకు పొత్తు ఉంటుందని చెప్పి సీపీఎంను కాంగ్రెస్ మోసం చేసిందని ధ్వజమెత్తారు. దేశంలో ఏ పార్టీ గెలిచినా ప్రాంతీయ పార్టీలు కీలకపాత్ర పోషిస్తాయని సీఎం కేసీఆర్ అంటున్నారని.. అయితే కేంద్రంలో బీజేపీ కాని ఇండియా కూటమి గాని అధికారంలోకి వస్తే బీఆర్‌ఎస్ దేనికి మద్దతునిస్తుందో స్పష్టం చేయాలన్నారు. కేసీఆర్ వ్యవహారశైలి బీజేపీకి మద్దతిచ్చేలా ఉందన్నారు. లౌకిక, ప్రజాస్వామ్య విధానాలను కాలరాస్తున్న మతోన్మాద బీజేపీ వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. రాష్ట్రంలో సీపీఎం 19, ఒక్క స్థానంలో సీపీఐ, మరికొన్ని స్థానాలల్లో వామపక్ష శక్తులు పోటీ చేస్తున్నాయని.. ఆయా పార్టీలకు ఓట్లు వేసి గెలిపించాలని రాఘవులు పిలుపునిచ్చారు. శాసనసభలో వామపక్ష ఎమ్మెల్యేలు లేకపోవడంతో ప్రజా సమస్యలపై గళం విప్పే అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ నేతలు జాన్‌వెస్లీ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీవీ రాఘవులు